కోసం కొంతమంది అక్కడ మరణించి తీరాలి. పోలీసులు చంపకపోతే ఆ పని వాళ్ళ మనుషులే చేస్తారు.

పోలీస్ బ్రూటాలిటీస్ గురించి పత్రికలు మర్నాడు రాస్తాయి. అలా మరణించినవారి శవాలని వూరేగించి స్మశానవాటికి తీసుకెళ్ళి కాలుస్తారు. సామాన్య ప్రజల ప్రాణాలని కాపాడలేని ముఖ్యమంత్రి గద్దె దిగాలంటారు. పోలీసు రాజ్యం నశించాలి అంటారు. లేదా ఆ చట్టం, ఆ ప్రభుత్వ పాలసీ మారాలంటారు. రాష్ట్రంలో లేదా దేశంలో శాంతి భద్రతలు నశించాయంటారు.

ఫలితంగా ముఖ్యమంత్రి మారతాడు. లేదా రాజీనామా చేస్తాడు. మళ్ళీ ఎన్నికలొస్తాయి.

మళ్ళీ ఓ రోజు ఆఫీసుకి బయలుదేరుతుంటే బస్సులు రావు. కారణం ఏంటంటే 'బంద్'. శాంతి భద్రతలు కాపాడలేని ముఖ్యమంత్రి గద్దె దిగాలనిట అని తెలుస్తుంది. 'నిజమే కామోసు' అనుకునే వాళ్ళు వున్నంత కాలం మన దేశం ఈ రాజకీయ చరిత్ర మారదు.

# ఆల్ అబవుట్ గ్రాండ్‌మా

భర్తని భార్య, తల్లిని కూతురు, తండ్రిని కొడుకు, బావని మరదలు ప్రేమించడం సహజం. ఒక్కోసారి ద్వేషించడం కూడా సహజం అయిందీ రోజుల్లో. కానీ ప్రతి మనిషి ప్రేమించడమే తప్ప ద్వేషించడం జరగని ఓ రక్తసంబంధీక బంధువు వున్నది.

ఆవిడే గ్రాండ్ మదర్. గ్రానీని మనవలు, మనవరాళ్ళు ప్రేమించడమే తప్ప ద్వేషించలేరు.

గ్రాండ్ మా అనే ఒకే పదం వుంది ఇంగ్లీషులో నాయనమ్మకి, అమ్మమ్మకి. పెటర్నల్ గ్రాండ్ మదర్ అంటే నానమ్మ. మెటర్నల్ గ్రాండ్ మదర్ అంటే అమ్మమ్మ. గ్రాండ్ మదర్‌ని ప్రేమగా గ్రాండ్‌మా

లేదా 'గ్రాన్ని' అని పిలుస్తుంటారు ఇంగ్లీషువారు.

తన నాయనమ్మ లేదా అమ్మమ్మ తను పుట్టేనాటికే మరణించిన వారు దురదృష్టవంతులు. ఎందుకంటే వారి ప్రేమ ఎలా ఉంటుందో ఆస్వాదించే అనుభవం అవకాశం వుండదు కాబట్టి.

అసలు కంటె కొసరు ముద్దని నాయనమ్మలకి, అమ్మమ్మలకి తమ కొడుకులు, కూతుళ్ళ కంటే వాళ్ళకి పుట్టిన సంతానమే ఎక్కువ ముద్దు. దీనికో కారణం చెప్పుకోవచ్చు. వాళ్ళు యవ్వనంలో వుండగా బరువు బాధ్యతలతో చిన్నపిల్లలని పెంచే తొందరలో పిల్లల సాన్నిహిత్యం లోని మాధుర్యాన్ని పూర్తిగా పొంది వుండరు. ఇప్పుడు ఎలాంటి వ్యాపకం లేకుండా ఎంతో లీషర్‌గా వున్నప్పుడు వాళ్ళు మిస్ అయింది మనవల ద్వారా పొందగలుగుతారు.

ఓ అమ్మాయికి కానుపు వస్తే పుట్టింటికి తల్లి దగ్గరకయినా వెళ్తుంది. లేదా తల్లో, అత్తగారో అయినా వస్తారు. తమ మనవణ్ణి ఎత్తుకుని ఆడించాలన్న కోరిక అంతర్లీనంగా వాళ్ళలో వుండబట్టే వస్తారు. ఇంకో కారణం, కానుపయాక అమ్మాయి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిల్లల్ని జాగ్రత్తగా పెంచడంలోని మెళకువలని బోధించడానికి.

అందుకే పసిపిల్లల స్నానం సాధారణంగా వుంటే నానమ్మో, అమ్మమ్మో చేయిస్తుంటారు. ప్రసవానంతరం బాలింత తినడానికి కట్టె కారం ఎలా చెయ్యాలో గ్రాండ్‌మాలకే తెలుస్తూంటూంది. ఇంగ్లీష్‌లో ఓ సామెత వుంది. గ్రాండ్‌మా అంటే ఎవరంటే 'మీ అమ్మ నిన్ను పెంచడానికి అనుమతించిన మనిషి' అని. మనవడి లేదా మనవరాలి ఆలనా, పాలనా ఎక్కువగా వాళ్ళే చూస్తూంటారు.

బాల్యంలో గ్రాండ్ మదర్స్ పక్కనే రాత్రుళ్ళు పడుక్కోడానికి పిల్లలు ఉత్సాహం చూపిస్తుంటారు. తల్లి లేదా తండ్రయితే అది చేయలేదని, ఇది చేయలేదని కొడుతుంటారు కాని గ్రాండ్‌మా ఎప్పుడూ కొట్టదు అన్నది ఓ కారణం అయితే, ఇంకోటి నిద్ర పట్టేదాకా బోలెడన్ని కథలు చెప్తుందనే ఆశతో. కాకి-పిచ్చుక, నక్క-బావ-ద్రాక్షపండు, కోతి గుండెకాయ, మొసలి, పావురం-చీమ-బోయవాడు, అడవిలో కష్టాలు

కొట్టుకునేవాడు_ఏడు గొడ్డళ్ళు లాంటి అనేక కథలు మనలో అధిక శాతం తొలిసారి విన్నవి గ్రాండ్‌మా చెప్తుంటేనే.

'మీ నాన్న చిన్నప్పుడేం చేసాడో తెలుసా?' అని చెప్పే కృత్యాలు పిల్లలు ఎంతో ఇంట్రెస్టింగ్‌గా వింటారు. ఇవి కేవలం గ్రాండ్‌మాలే చెప్ప గలరు.

పిల్లలు పెరిగి పెద్దవాళ్ళయి స్వార్థాలు ఏర్పడ్డాక తల్లిదండ్రుల్ని పెద్దగా ఖాతరు చేయరు. అలాంటప్పుడు ఆ తల్లిదండ్రులు తమ పిల్లల పిల్లల్నే అధికంగా ప్రేమించగలరు. సంజయ్‌గాంధీ మరణానంతరం ఇందిరాగాంధి, మేనకాగాంధి వేరుపడ్డారు. మేనకాగాంధితో సఖ్యతగా వుండకపోయినా ఇంధిరాగాంధి తన మనవడు వరుణ్‌గాంధీని మాత్రం తన దగ్గరికి పిలిపించుకునేది. ఆ పసి మనవడితో గడిపేది. ఇందిరా గాంధీ రాజకీయవేత్తగా ఎందర్ని దడదడలాడించినా గ్రాండ్‌మా పాత్రని మరువలేదు. ప్రియాంక, రాహుల్, వరుణ్‌గాంధిలతో గడుపుతూండేది.

నిజానికి పిల్లల మానసిక ఆరోగ్యానికి 'గ్రాని' అనే పాత్ర ఎంతో మేలు చేస్తుంది. ఇది గ్రహించిన పాశ్చాత్యులు 'ఎడాప్ట్ ఎగ్రని' అనే ప్రోగ్రాంని మొదలుపెట్టారు. అంటే అమ్మమ్మ లేక నాయనమ్మ లేని పిల్లల తల్లిదండ్రులు, తమకి ఎలాంటి బంధువులు లేక 'హోమ్ ఫర్ ది ఏజ్డ్'లో వుండే ముసలివాళ్ళని తమ ఇళ్ళకి తెచ్చుకుని తమతో వుంచు కుంటారు. వాళ్ళు ఇంట్లోని పిల్లలకి 'గ్రాండ్‌మా'గా వ్యవహరిస్తారు.

నానమ్మ, అమ్మమ్మలని తీసుకుంటే పిల్లలకి అమ్మమ్మే దగ్గరవు తుంటుంది మన సమాజంలో. ఇందుకు కారణం మొదటి పురుడు పుట్టింట్లోనే జరగాలి అనే ఆచారం. మూడోనెల దాటేదాకా పిల్ల అమ్మమ్మ దగ్గరే పెరిగి తర్వాత తల్లితో యింటికి చేరడం ఒకటి. మూడో నెల కల్లా అమ్మమ్మని గుర్తు పట్టేస్తుంది మనవరాలు లేదా మనవడు. మొగుడింటికి తిరిగి వచ్చాక నాలుగైదు రోజులు అమ్మమ్మ మీద దిగులుతో పిల్ల ఏడవధం కూడా కద్దు.

ఇంకో కారణం పెళ్ళయిన ప్రతి మగాడికీ తన పుట్టింటి వారితో రాకపోకలు తగ్గి క్రమంగా అత్తింటివైపు వారితో సంబంధ

బాంధవ్యాలు పెరుగుతాయి. అందుకే 'పెళ్ళయ్యే దాకానే కొడుకు కొడుకు. పెళ్ళయ్యాక కూడా కూతురు కూతురే' అనే సామెత వచ్చింది. అమ్మమ్మ వచ్చినంత తరుచు లేదా అమ్మమ్మ యింటికి వెళ్ళినంత తరచు నానమ్మ రావడమో లేదా నానమ్మ యింటికి వెళ్ళడమో జరగదు కాబట్టి అమ్మమ్మే పిల్లలకి దగ్గరవుతుంటుంది.

వేసవికాలం శెలవలకి పిల్లలు అమ్మమ్మ వూరు వెళ్తూంటారు తల్లిదండ్రులతోనో లేదా ఒంటరిగానో. నానమ్మ వూరెళ్ళినా చుట్టపు చూపుగా వుండి రావడమే జరుగుతూంటుంది. ఇందిరాగాంధికీ కూతుళ్ళు కూడా వుంటే యిలాగే జరిగి వుండేది. ఇందిరాగాంధి పుట్టింది మన దేశంలోనే కాని ఎక్కడో కాదుగా. శెలవలకి యింటికి వచ్చిన మనవలకి, మనవరాళ్ళకి అనేక రకాల తిండి పదార్థాలు వండి పెడుతూంటుంది అమ్మమ్మ పెద్దయినా గుర్తుండి పోయేది యివే.

కాని నా విషయంలో యిలా జరగలేదు. మా అమ్మమ్మ మాకు 'క్రమశిక్షణ' నేర్పేది. ఏదయినా తప్పు చేస్తే తిట్టిపోసేది. పెద్దగా దగ్గరికి తీసేది కాదు. ఏటా రెండు నెలలయినా వచ్చి మా యింట్లో వుండేది. అయినా అమ్మమ్మ తిడుతుంది అనే భయం కన్నా అమ్మమ్మ వస్తోందంటే ఎంతో ఆనందంగా వుండేది. కాని మా నాయనమ్మ ఎలా వుంటుందో నాకు తెలీదు. ఎందుకంటే ఆవిడ మా అమ్మా నాన్నలకి పెళ్ళికాకముందే పోయింది.

'గ్రాండ్ మదర్' అంటే ఎవరు?' అనే ప్రశ్న నిచ్చి పిల్లల్ని సమాధానం రాయమంటే ఆరేళ్ళ అమెరికన్ స్కూలు విద్యార్థులు రాసిన కొన్ని సమాధానాలు తమాషాగా వున్నాయి. వాటిలో కొన్ని....

* పోలీసంటే భయపడని వ్యక్తే గ్రాండ్‌మా అంటే.
* నా గ్రాండ్ మదర్ మొహంనిండా ముడతలే. ఇస్త్రీ చేసినా గ్రాండ్ మదర్ మొహంలోని ముడతలు పోవు.
* గ్రాండ్ మదర్ అంటే పండగలప్పుడు అనేక పిండి వంటలు చేసే మనిషి.
* నా చొక్కా బటన్స్ తెగితే వాటిని వెంటనే కుట్టి యిచ్చేది ఒక్క

మా గ్రాండ్ మదరే.
* మా నాన్న నన్ను కోప్పడితే మా నాన్నని 'ఏడ్చావ్ లేవోయ్'
అని కోప్పడేది ఒక్క మా గ్రాండ్ మదరే.
* నేనెప్పుడు పుట్టానో, ఏ నక్షత్రంలో, ఏ రోజు పుట్టానో గుర్తుంచు
కునే వ్యక్తి ఒక్క నా గ్రాండ్ మదరే.
* అమ్మకి చెప్పడానికి భయపడే విషయాలని నేను చెప్పగలిగే ఏకైక
మనిషి నా గ్రాండ్ మదర్.
* నా గ్రాండ్ మదర్ కూడా నా మదర్ లాంటిదే. కాకపోతే
అమ్మలా ఎక్కువగా మేకప్ చేసుకోదు.
* మేం ఎంత అల్లరి చేసినా తిట్టని మనిషి మా గ్రాండ్ మదరే.
* నాలాకాక చిన్నప్పుడు టి. వి. లేకుండా పెరిగినమ్మాయే మా
గ్రాండ్ మదర్ అంటే.
* గ్రాండ్ మదర్ అంటే గౌను తప్ప మినిస్కర్ట్స్ కాని, జీన్స్
కాని (చీర తప్ప పంజాబీ డ్రెస్ కాని, మిడీస్కాని) వేసుకోలేని
ముసలావిడ.
* అన్నం పారేసినా తిట్టని ఆవిడే గ్రాండ్ మదర్ అంటే.
* అడవాళ్ళు వుద్యోగాలు చేయని కాలంలో పుట్టిన అమ్మాయి మా
గ్రాండ్ మదర్.
* నా గ్రాండ్ మదర్ అంటేనా? షికాగోలో సిమెట్రిలో పాతి
పెట్టబడ్డ ఆవిడ.
* గ్రాండ్ మదర్ అంటే ప్రేమ.
ఏ దేశస్థులకయినా గ్రాండ్ మదర్ అంటే దాదాపు యిలాంటి
భావాలే వుంటాయి అని ఒప్పుకోక తప్పదు.

అయితే తాతయ్యలంటే పిల్లలకి ఇష్టం వుండదా? అమ్మమ్మ,
నాయనమ్మలంత వుండదు. ఎందుకంటే తాతయ్య ముద్దు పెట్టు
కుంటుంటే మీసాలు గుచ్చుకుంటాయి. చుట్టవాసన వేస్తుంది. 'భడవా
ఖానా' అని చెవి మెలిపెడుతుంటారు కనక — ఒక్క సీతారామయ్యగారి
మనవరాలిని వదిలేస్తే. ఆ సినిమాలో చిత్రంగా ఆమెకి తన నానమ్మంటే

పెద్దగా ఆప్యాయత వున్నట్లు కనబడదు. హీరోగారి చిత్రాల్లో ఆయన డామినేషన్ కోసం యిలాంటి సర్దుబాట్లు తప్పవు కదా మన తెలుగు చిత్రసీమలో.

ఫాదర్స్ డే, మదర్స్ డే ఏర్పాటు చేసిన అమెరికన్స్ మరి 'గ్రాండ్ మాస్ డే' అని ఓ రోజు అమ్మమ్మలకీ, నాయనమ్మలకి ఎందుకు కేటాయించలేదో!

## గుడ్డు ఈజ్ గుడ్

మనుషులని ప్రపంచమంతటా రెండు రకాలుగా విభజించారు. ఒకరు వెజిటేరియన్స్, ఇంకోరు నాన్-వెజిటేరియన్స్. కాని మనవాళ్ళు మాత్రం మనుషుల్ని మూడు రకాలుగా చీల్చారు. వెజిటేరియన్స్, నాన్-వెజిటేరియన్స్, ఎగ్గేరియన్స్.

ఎగ్గేరియన్స్ అంటే వెజిటేరియన్స్ ప్లస్ గుడ్డుని కూడా తినేవాళ్ళన్నమాట. అసలు గుడ్డు శాఖాహార పదార్థమా లేక మాంసాహార పదార్థమా? దీనిమీద రెండు అభిప్రాయాలున్నాయి. కొందరు వెజిటేరియన్ అంటారు. ఎందుకంటే దీన్ని తినడం ద్వారా ఎలాంటి హింస జరగడంలేదు. యిలా జీవం పోసుకోని పదార్థం కాబట్టి గుడ్డు వెజిటేరియన్ అంటే యింకొందరు 'కానేకాదు, వెజిటేరియన్ ఐటంస్ అన్నీ భూమి నించి పుడతాయి. జీవినించి పుట్టింది కాబట్టి గుడ్డు మాంసాహారమే' అంటారు. మరి పాలు కూడా జంతువుల నించే పుడతాయి కదా అని అడుకొడితే 'అది మనుషుల్లోనూ పుడతాయి. అసలు మనం తల్లిపాలే తాగేకదా మొదట్లో బ్రతికేది' అంటారు. ఈ విధంగా రైలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నించి విజయవాడ వచ్చేదాక 'గుడ్డు శాఖమా లేక మాంసమా' అన్న ప్రశ్నని లేవదీని బైంపాస్ చేయచ్చు. కావాలంటే మీరూ ప్రయత్నించి చూడండి.